సాక్షి పశ్చిమగోదావరి

శుక్రవారం । 31 । మార్చి । 2023



వేడుకల్లో అపశ్రుతి

తణుకు మండలం దువ్వవేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీరామనవమి వేడుకల్లో అపశ్రుతి చోటు చేసుకుంది. అగ్నిప్రమాదంలో చలువ పందిళ్లు దగ్ధమయ్యాయి. 8లో ▸



మద్దిలో నేత్రపర్వం

మద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో సీతారాముల కల్యాణం గురువారం నేత్రపర్వంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు కల్యాణాన్ని వీక్షించారు. 8లో ▸

రోల్ మోడల్



స్కూల్ విద్యార్థుల సంఖ్య పెంచడమే కాక ఉత్తమ విద్యను అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలానికి చెందిన మక్కే వేణు గోపాలరావు మాస్టారు. 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (శుక్రవారం సాయంత్రం)	సహరి (శనివారం వేకువజాము)
భీమవరం	6.24	4.39
తాడేపల్లిగూడెం	6.26	4.46
నరసాపురం	6.23	4.37

● వైభవంగా సీతారాముల కల్యాణం



ద్వారకా తిరుమల : చినవెంకన్న నిత్యకల్యాణ మండపంలో శ్రీవారు, అమ్మవార్లు, సీతారాములకు కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



పెంటపాడు : కె.పెంటపాడులో శ్రీరామనవమి వేడుకలలో స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, కుటుంబ సభ్యులు



సాక్షి, భీమవరం : పట్టణంలోని పసుపులేటి వారి వీధిలో శ్రీరామనవమి వేడుకల్లో పట్టువస్త్రాలు అందచేస్తున్న మండలి చైర్మన్ మోషేను రాజు

న్యూస్‌రీల్

పోలీస్ స్టేషన్ల తనిఖీ



డీఐజీకి స్వాగతం పలుకుతున్న పోలీసులు

సాక్షి, భీమవరం: భీమవరం రూరల్, టూటౌన్ పోలీస్ స్టేషన్లను ఏలూరు రేంజ్ డీఐజీ జి.పాలరాజు గురువారం తనిఖీ చేశారు. సాధారణ తనిఖీల్లో భాగంగా రికార్డులను పరిశీలించారు. కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎస్పీ యు.రవిప్రకాష్, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

వీరవాసరం పోలీస్‌స్టేషన్ తనిఖీ

వీరవాసరం: ప్రజలతో పోలీసులు స్నేహపూర్వక వాతావరణంలో పనిచేయాలని ఏలూరు డీఐజీ జి.పాలరాజు అన్నారు. వీరవాసరం పోలీస్ స్టేషన్‌ను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు.

మావుళ్లమ్మ హుండీల ఆదాయం రూ.41,72,846

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం పట్టణ ఇలవేల్పు శ్రీమావుళ్లమ్మవారి ఆలయంలో హుండీలను గురువారం తెరిచి లెక్కించారు. 45 రోజులకు రూ.41,72,846 నగదు, 96.300 గ్రాముల బంగారం, 143 గ్రాముల వెండి, విదేశీ కరెన్సీనోట్లు వచ్చాయని ఆలయ ఈఓ, దేవదాయ సహాయ కమిషనర్ యర్రంశెట్టి భద్రాజి తెలిపారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మన్ మానేపల్లి నాగేశ్వరరావు, ధర్మకర్తలు ముత్యాల వెంకట రామారావు, చెల్లంకి నాగ శేష గిరి, మావూరి సుందరరావు, రామాయణం సత్యనారాయణ, గోపిశెట్టి విజయలక్ష్మి, తాళ్లపూడి భాగ్యలక్ష్మి, కోయ వెంకట లక్ష్మి, నీలాపు విజయ నాగలక్ష్మి, ఎస్సై వి.వెంకటేశ్వరరావు ఈవో తోట శ్రీనివాసరావు, బ్యాంకు సిబ్బంది, రెవిన్యూ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బాడీ బిల్డింగ్ పోటీలు



భీమవరంలో బాడీ బిల్డింగ్ పోటీల దృశ్యం

సాక్షి, భీమవరం: క్రీడలు మానసిక ఉల్లాసానికే గాకుండా ఉపాధి అవకాశాలు కల్పించడానికి ఎంతగానో దోహదం చేస్తాయని భీమవరం టౌన్ హాల్ మాజీ అధ్యక్షుడు మెంటే పార్థసారధి అన్నారు. టౌన్ హాల్లో గురువారం రాత్రి జాతీయ క్రీడాకారుడు ఎస్‌వీఆర్ దాస్ స్మారక రాష్ట్ర స్థాయి బాడీబిల్డింగ్ పోటీలను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ పోటీల్లో వివిధ జిల్లాల నుంచి బాడీ బిల్డర్స్ పాల్గొన్నారు. కార్యక్రమంలో గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, యిర్రింకి సూర్యారావు పాల్గొన్నారు.

కాలువలు, డ్రెయిన్లకు మరమ్మతులు

- వేసవిలో పూడికతీతకు కార్యాచరణ
- కాలువలకు రూ.12 కోట్లతో ప్రతిపాదనలు
- డ్రెయిన్ల అభివృద్ధికి రూ.8 కోట్లతో ప్రతిపాదనలు



జీ అండ్ వీ పంట కాలువ

భీమవరం(ప్రకాశం చౌక్): పంట కాలువలతో పాటు మురుగునీటి పారుదలలో ముఖ్యమైన డ్రెయిన్లలో పూడిక తొలగింపు పనులకు ఇప్పటి నుంచే సిద్ధమవుతున్నారు. ఏటా రబీ పంట ముగిసిన అనంతరం వేసవిలో ఈ పనులు చేపడతారు. అందుకు సంబంధించి కార్యచరణను ఇరిగేషన్, డ్రెయినేజ్ శాఖల అధికారులు రూపొందిస్తున్నారు. రబీ సాగుకు వచ్చే నెల 15 వరకు సాగునీరు అందించి తర్వాత కాలువలను మూసివేస్తారు. కాలువలకు నీరు ఆపేసిన తర్వాత కాలువలు, డ్రెయిన్ల అభివృద్ధి పనుల కోసం ప్రతిపాదనలు తయారు చేశారు.

పంట కాలువల అభివృద్ధికి రూ.12 కోట్లతో ప్రతిపాదనలు

జిల్లాలో సాగునీరు, తాగు నీరు అందించే పంట కాలు వలకు సంబంధించి 100 పనుల కోసం రూ.12 కోట్లతో అంచనా వేసి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కాలువల తూడు తొలగింపు, గట్ల పటిష్టం, లాకుల మరమ్మతులు, స్లూయిజ్ మరమ్మతులు, లాకు తలుపుల మరమ్మతులు తదితర పనులు చేయనున్నారు.

రూ.8 కోట్లతో డ్రెయిన్ల అభివృద్ధి

ముంపు నీరును బయటకు తీసుకువెళ్లే డ్రెయిన్ల మరమ్మతులు కూడా ముఖ్యం. ఈ వేసవిలో డ్రెయిన్ల బాగుకు 60 పనులు గుర్తించి రూ.8 కోట్ల ప్రతిపాదనలు సిద్ధం చేశారు. డ్రెయిన్లలో పూడికతీత పనులు, తూడు తొలగింపు, గట్ల పటిష్టం తదితర పనులు చేయనున్నారు. వచ్చే నెల మొదటి వారంలో కాడా(కమెండ్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ) కమిటీ సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో కాలువలు, డ్రెయిన్లు అభివృద్ధి పనులపై చర్చించి ప్రతిపాదించిన పనులను మంజూరు చేయించడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

కాలువల అభివృద్ధిపై దృష్టి

గత ప్రభుత్వం జిల్లాలోని పంట కాలువలు, డ్రెయిన్ల అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. నీరు ఉధృతంగా ప్రవహిస్తున్న సమయంలో మెషీన్లు తీసుకొచ్చి కాస్త తూడు తొలగించి కాంట్రాక్టర్లు, నేతలు లక్షల్లో బిల్లుల పెట్టుకుని దోచుకున్నారు. వేసవిలో కాలువల పూడిక తీత పనులకు అనుకులంగా ఉన్నప్పటికీ గత టీడీపీ ప్రభుత్వం ఒక్క కాలువలో కూడా పూడికతీత పనులు గానీ, లాకుల మరమ్మతులు గానీ చేయించలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏటా వేసవిలో కాలువలు, డ్రెయిన్ల అభివృద్ధి పనులు చేస్తుంది. దాంతో రబీ(దాళ్వా) పంటకు చివరి వరకు సాగు నీరు అందించగలుగుతున్నారు.

జిల్లాలో కాలువలు, డ్రెయిన్ల వివరాలు

ఇరిగేషన్ సబ్ డివిజన్లు: తాడేపల్లిగూడెం, ఉండి, తణుకు, నర్సాపురం

డ్రెయినేజ్ సబ్ డివిజన్లు: తాడేపల్లిగూడెం, ఆకివీడు, భీమవరం, పాలకొల్లు

ప్రధాన పంట కాలువలు	:	4
చిన్న కాలువలు	:	150
ప్రధాన డ్రెయిన్లు	:	6
చిన్న డ్రెయిన్లు	:	120

వెంటనే చేపడతాం

ఈ వేసవిలో కాలువలు, డ్రెయిన్ల అభివృద్ధి పనుల కోసం గుర్తించిన పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. పనులపై కమిటీతో చర్చించి పనులు మంజూరు చేయగానే కాలువలు, డ్రెయిన్ల అభివృద్ధి పనులు చేపడతాం. అభివృద్ధి పనులకు సంబంధించి రూ.20 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశాం. ఏప్రిల్ 15 తర్వాత ఈ పనులు చేపడతాం.

– పి.నాగార్జునరావు, ఇరిగేషన్ ఎస్‌ఈ, భీమవరం

భీమవరం అభివృద్ధిని వేగవంతం చేయాలి



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణాల అభివృద్ధి మాటల్లో కాదని, ఆచరణలో ఉండాలని, పనులు వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని పురపాలక సంఘం అధికారులను కలెక్టరు పి.ప్రశాంతి ఆదేశించారు. గురువారం భీమవరం పురపాలక సంఘం పరిధిలో పలు ప్రాంతాలను కలెక్టరు పరిశీలించారు. అండర్ పాస్ దగ్గరలో ఫుడ్ కోర్టు ఏర్పాటు కోసం స్థల పరిశీలన చేశారు. డీమార్ట్ ఎదురుగా రోడ్డు ఆక్రమణలు తొలగించిన ప్రాంతాన్ని కలెక్టరు పరిశీలించారు. సోమగుండం చెరువు, ఎడ్వర్డ్ ట్యాంకు సుందరీకరణ పనుల కోసం స్థల సేకరణను పరిశీలించారు. పురపాలక సంఘం ఆవరణలో నిర్మించిన పార్కును పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ట్రాఫిక్‌కు అడ్డంకి కలిగించే వాటిని తొలగించడంలో రాజీ పడవద్దని ఆదేశించారు. రోడ్డు మార్జిన్లలో, ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటడం వెంటనే చేపట్టాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో రోడ్డు మార్జిన్‌లో ఉన్న వివిధ షాపుల ముందు పేవర్ బ్లాక్స్‌ను ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలని కలెక్టరు సూచించారు.

రెండు కుటుంబాల్లో తీరని విషాదం

రోడ్డు ప్రమాదంలో దంపతులు, మేనల్లుడి మృతి



జంగారెడ్డిగూడెం సబ్‌స్టేషన్ సెంటర్‌లో రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన నక్క రవి, వేల్పుల జెసెఫ్ బెంజిమన్‌లు

జంగారెడ్డిగూడెం: ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద గురువారం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో దంపతులతో పాటు వారి మేనల్లుడు మృతిచెందాడు. పోలీసులు, కుటుంబసభ్యుల వివరాలు ప్రకారం .. సత్తుపల్లి మండలం కిస్టారం గ్రామానికి చెందిన నక్క రవి (30), ఉష (25) దంపతులు రెండు రోజుల క్రితం తూర్పుగోదావరి జిల్లా గోకవరంలో ఉంటున్న రవి సోదరి వేల్పుల కళావతి ఇంటికి వెళ్లారు. గురువారం రవి, ఉష దంపతులు మోటార్‌సైకిల్‌పై సత్తుపల్లి బయలుదేరగా, రవి సోదరి కళావతి, బావ అనంతకుమార్, వారి ఇద్దరు పిల్లలు జోసెఫ్ బెంజిమన్ (12), జాన్‌బాబులు బస్సులో బయల్దేరారు. జంగారెడ్డిగూడెం వచ్చేసరికి జోసెఫ్ బెంజిమన్ బైక్‌పై వస్తానని మారాం చేయడంతో జంగారెడ్డిగూడెం బస్టాండ్ వద్ద మేనల్లుడిని రవి ఎక్కించుకుని బయలుదేరాడు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపానికి వచ్చేసరికి, ఎదురుగా వేగంగా వస్తున్న లారీ వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో రవి, బెంజిమిన్‌లకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన ఉషను జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి.. అక్కడి నుంచి మెరుగైన చికిత్సకు ఏలూరు తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతిచెందింది. బెంజిమన్ తల్లి కళావతి కుమారుడి మృతదేహం వద్ద రోదిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది. జంగారెడ్డిగూడెంలోని కాకర్ల వై.జంక్షన్, విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రాంతాల మధ్య ఉన్న జాతీయ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినా వాహనదారులు వేగాన్ని నియంత్రించడం లేదు. ఈ ప్రాంతంలో ఫిబ్రవరి 9న జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థులు మరణించారు.

రాకపోకలకు అంతరాయం

మధ్యాహ్నానికి రైల్వే గేట్ల మరమ్మతులు పూర్తి



దురంతో ఎక్స్‌ప్రెస్ రైలు ఇంజిన్‌లో చిక్కుకున్న బొలెరో వాహనం భాగాలు



భీమడోలులో గేటుకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

భీమడోలు: బొలెరో వాహనాన్ని దురంతో ఎక్స్‌ప్రెస్ ఢీకొట్టిన ఘటనలో గురువారం తెల్లవారుజాము నుంచి రైల్వే అసిస్టెంట్ సెక్యురిటీ కమిషన్ చౌహాన్ ఆధ్వర్యంలో రైల్వే శాఖలోని ఇంజనీరింగ్ విభాగాలకు చెందిన అధికారుల పర్యవేక్షణలో యుద్ధ ప్రాతిపదికన పనులు చేసారు. పట్టాలపై పూర్తిగా ధ్వంసమైన వ్యాన్‌ను జేసీబీ సాయంతో తొలగించి లైన్ క్లియర్ చేసారు. వేరే ఇంజిన్‌ను బోగీలకు బిగించి ఉదయం 8.48 గంటలకు దురంతో ఎక్స్‌ప్రెస్ రాకపోకలను పునరుద్ధరించారు. ఈ పనులను రాజమండ్రి ఆర్‌పీఎఫ్ సీఐ సైదయ్య, ఎస్సై మోహన్, సీఆర్‌పీఎస్ ఎస్సై డి.నరసింహారావు, ఆర్పీఎఫ్ ఎస్సై డి.ధనుష్, వివిధ విభాగాల అధికారులు పరిశీలించారు. రైల్వే గేట్లు ధ్వంసం కావడంతో భీమడోలు జంక్షన్ మీదుగా ద్వారకాతిరుమల వెళ్లే ఉమ్మడి జిల్లాల డిపోలకు చెందిన బస్సులు ప్రత్యామ్నయ మార్గాల్లో రాకపోకలు సాగించాయి. ఆర్టీసీ బస్సులు పాతూరు, కురెళ్లగూడెం గేట్ల మీదుగా నడిచాయి. రైతులు, భక్తులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శ్రీరామనవమి రోజున ద్వారకాతిరుమలకు వెళ్లే భక్తులు వేరే మార్గాల ద్వారా వెళ్లారు. గేట్లకు అత్యవసర మరమ్మతులు చేపట్టారు. మరమ్మత్తులు మధ్యాహ్నానికి పూర్తి చేయడంతో వాహనాల రాకపోకలు యథావిధిగా ప్రారంభమయ్యాయి. సుమారు 11 గంటల పాటు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

ఏడుగంటల పాటు పడిగాపులు

భీమడోలు రైల్వే స్టేషన్‌లో ఏడుగంటల పాటు ప్రయాణికులు పడిగాపులు కాశారు. 15 నుంచి 20 రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మూడు గంటల అలస్యంగా రాకపోకలు సాగించాయి. వాస్తవానికి సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్లే దురంతో ఎక్స్‌ప్రెస్ రైలు మధ్యలో గుంటూరు, విజయవాడ, రాజమండ్రి రైల్వే స్టేషన్లలోనే ఆగుతుంది. కొందరు రాజమండ్రికి ఆర్టీసీ బస్సుల్లో వెళ్లారు. వైజాగ్ వెళ్లే ప్రయాణికులంతా ఏడుగంటల పాటు రైలులోనే వేచి ఉన్నారు.

ఏప్రిల్ 2న జిల్లా స్థాయి చెస్ పోటీలు

సాక్షి, భీమవరం: అనసూయ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఏప్రిల్ 2న జిల్లా స్థాయి అండర్–17 బాల, బాలికల చెస్‌పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాదాసు కిషోర్, గమిని పవన్ గురువారం చెప్పారు. కిడ్జి ప్లేస్కూల్లో నిర్వహించే పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 2006 జనవరి1 తరువాత జన్మించినవారై ఉండాలన్నారు. విజేతలైన బాలురు అనకాపల్లి, బాలికలు విజయవాడలో నిర్వహించే రాష్ట్ర స్థాయి అండర్–17 ఫైడ్ రేటింగ్ చెస్ పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని 90632 24466 నెంబరులో సంప్రదించాలని అన్నారు.

● ముద్దొచ్చేలా బుల్లి అశ్వం



శ్రీవారి అశ్వం గురువారం మధ్యాహ్నం బుల్లి అశ్వానికి జన్మనిచ్చింది. స్వామివారి సేవలకు ప్రస్తుతం మూడు అశ్వాలను వినియోగిస్తున్నారు. అందులో ఒకటి ఆడది(యోగిని అశ్వం) మిగతా రెండు అశ్వాలు మగవి. ఇవి కొండపైన గోసంరక్షణశాల వద్ద ఉంటున్నాయి. యోగిని ఆడ బుల్లి అశ్వానికి జన్మనిచ్చింది. ముద్దు ఉన్న ఈ బుల్లి అశ్వాన్ని చూసేందుకు స్థానికులు ఆసక్తి చూపుతున్నారు.

- ద్వారకాతిరుమల

ప్రభుత్వ లాంఛనాలతో నారాయణ స్వామి అంత్యక్రియలు

- ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఏర్పాట్లు
- ప్రభుత్వం తరఫున ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ నివాళి



ఉప్పలూరులో రాజ్యసభ మాజీ సభ్యుడు నారాయణస్వామి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్, ఎమ్మెల్సీ రవీంద్రనాథ్

ఉండి: మాజీ మంత్రి, రాజ్యసభ మాజీ సభ్యుడు యర్రా నారాయణస్వామి అంత్యక్రియలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించారు. గురువారం నారాయణస్వామి స్వగ్రామం ఉండి మండలం ఉప్పులూరులో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అంత్యక్రియల్లో పాల్గొన్నారు. నారాయణస్వామి మరణవార్త తెలిసినప్పటి నుంచి డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు ఉప్పులూరులో ఉండి ఆయన కుటుంబానికి అండగా ఉన్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు విషయం తెలియగానే అక్కడికి చేరుకుని నివాళులర్పించారు. ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ రాజకీయాల్లో నారాయణస్వామి ఎంతో మందికి ఆదర్శమన్నారు. మన ప్రాంతానికి చెందిన సీనియర్ రాజకీయ నాయకుడిని కోల్పోవడం తీరని లోటని అన్నారు. క్రమశిక్షణకు మారుపేరు, కార్యదీక్షాపరుడిగా ఈ ప్రాంత రైతులను ఆదుకున్న మంచి నాయకుడు నారాయణస్వామి అని అన్నారు. యర్రా నారాయణ స్వామి మరణవార్తను ముఖ్యమంత్రికి చెప్పగానే.. అంత గొప్ప నాయకుడికి ఘన నివాళి అర్పించడం ప్రభుత్వ బాధ్యత అని ముఖ్యమంత్రి అన్నారన్నారు. తనను స్వయంగా వెళ్లి అంత్యక్రియల కార్యక్రమాలు పర్యవేక్షించి ప్రభుత్వ లాంఛనలతో నిర్వహించాలని, అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారని తెలిపారు. కాపు సామాజికవర్గానికి చెందిన ఉన్నత నాయకుడికి ముఖ్యమంత్రి ఇచ్చిన గౌరవాన్ని చూసి చాలా సంతోషించానని, దగ్గరుండి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరిగేలా ఏర్పాట్లు చేయించినట్లు చెప్పారు.

రాజకీయాల్లో ఎందరికో ఆదర్శం

డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు, ఎమ్మెల్సీ వంకా రవీంద్ర మాట్లాడుతూ గ్రామ సర్పంచ్ స్థాయి నుంచి రాజకీయ ప్రస్థానం ప్రారంభించి.. ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా పనిచేశారని, రెండుసార్లు ఎమ్మెల్యేగా, రాజ్యసభ సభ్యుడిగా, జెడ్పీ చైర్మన్‌గా ఉన్నారని, ఆయన సేవలు ఎనలేనివని అన్నారు. ఆయనను చూసి ఎందరో రాజకీయాల్లోకి వచ్చారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, టీటీడీ మాజీ సభ్యుడు గోకరాజు రామరాజు, పాతపాటి శ్రీనివాసరాజు(వాసు), ఆర్టీఓ దాసి రాజు, ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, జెడ్పీటీసీ రణస్థల కనకదుర్గ, రణస్థల మహంకాళీ, సర్పంచ్ యర్రా దుర్గారావు, ఎంపీటీసీ నిమ్మల కేశవకుమార్, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు, పలువురు టీడీపీ మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు నారాయణస్వామికి నివాళులర్పించారు.

క్లుప్తంగా

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం



దాత గంగరాజుకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ ఏఈఓ దుర్గారావు

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు గురువారం రూ. 1,01,116 లను విరాళంగా అందజేశారు. తాడేపల్లిగూడెంకు చెందిన కూరపాటి గంగరాజు ముందుగా కుటుంబ సమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. దాతకు ఆలయ ఏఈఓ మెట్టుపల్లి దుర్గారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

పెదవేగి: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వివాహిత ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. ఎస్సై ఎం.లక్ష్మణ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెదవేగి ఎంఆర్‌సీ కాలనీకి చెందిన సూరెడ్డి సునీత (40) ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తోంది. ఆమె కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. చాలా చోట్ల వైద్యం చేయించుకున్నా తగ్గకపోవడంతో విరక్తి చెంది బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. భర్త సత్యనారాయణ ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోల్ మోడల్

తాను ఏ పాఠశాలలో పనిచేస్తే అక్కడ విద్యార్థుల సంఖ్య (రోల్) పెంచడమే కాక ఉత్తమ విద్యను అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు మక్కే వేణుగోపాలరావు మాస్టారు. రాష్ట్ర ప్రభుత్వం నాడు–నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలలు అభివృద్ధి చేస్తుండటం, విద్యార్థులకు సౌకర్యాలు మెరుగుపరచడం వంటి అంశాలే కాక విద్య ఆవశ్యకతను తల్లిదండ్రులకు వివరిస్తూ వారి పిల్లలను బడులకు పంపేలా అవగాహన కల్పిస్తున్నారు. తన 21 ఏళ్ల ఉపాధ్యాయ వృత్తిలో ఇప్పటివరకు 241 మంది విద్యార్థులను ఇలా పాఠశాలల్లో చేర్పించారు. 'పిల్లలందరినీ మనబడిలో చేర్పుదాం – ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేద్దాం' అనే నినాదంతో ఆయన కృషి చేస్తున్నారు.



విద్యార్థులకు పాఠాలు చెబుతున్న మక్కే వేణుగోపాలరావు మాస్టారు (ఫైల్)

- పాఠశాలలో పిల్లల సంఖ్య పెంపే లక్ష్యం
- 21 ఏళ్లలో 241 మంది చేరికకు కృషి
- ఆదర్శంగా మక్కే మాస్టారు సేవలు

నూజివీడు: ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు తమ సిబ్బందిని ఇంటింటికి పంపించి పిల్లలు ఎక్కడున్నా గాలించి తమ పాఠశాలల్లో చేర్చుకుంటున్న ఈ రోజుల్లో తాను పనిచేసే పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచడమే కాకుండా పేద విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు వేస్తున్నారు మక్కే వేణుగోపాలరావు మాస్టారు. 2002 డీఎస్సీలో ఎంపికై ఆగిరిపల్లి మండలం ఎం.సూరవరం ఎంపీయూపీ స్కూల్‌లో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడిగా ఆయన చేరారు. ఈ గ్రామంలోని యూపీ స్కూల్.. హైస్కూల్‌గా ఎప్పుడు అవుతుందోనని సురవరం చుట్టుపక్కల గ్రామాలైన కొమ్మూరు, కృష్ణవరం సగ్గురు, బండారుగూడెం ప్రాంత ప్రజల చిరకాల స్వప్నంగా మారింది. ఈ నేపథ్యంలో ఆనాటి, ప్రస్తుత ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు చొరవతో ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ అయ్యింది. 2005 సంవత్సరంలో 6, 7, 8 తరగతులతో ప్రారంభమైన ఈ పాఠశాలకు ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న కె.ఆనంద్ బాబు, మక్కే వేణుగోపాల్‌రావులను నియమించారు. అదే గ్రామంలో నివాసం ఉంటూ మక్కే వేణుగోపాలరావు చుట్టుపక్కల గ్రామాల్లో తిరిగి 70 మంది విద్యార్థులను ఈ పాఠశాలలో చేర్పించారు. 2007–2008 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో 18 మంది విద్యార్థులకు గాను 17 మంది ఉత్తీర్ణులయ్యారు. 2008–2009 విద్యా సంవత్సరంలో పదో తరగతి విద్యార్థిని పి.ఝాన్సి 542 మార్కులు సాధించి నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించింది. గంప సతీష్ అనే విద్యార్థి 526 మార్కులు సాధించడంతో విజయవాడ పాలిటెక్నిక్ కాలేజీలో ఉచిత సీటు లభించింది. అనంతరం జరిగిన బదిలీల్లో 2009 ఆగస్టులో సర్నాలగూడెం ఆది ఆంధ్ర ప్రాథమిక పాఠశాలకు వచ్చారు. ఈ పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకం ఏజెన్సీ లేకపోవడంతో విద్యార్థులకు భోజనం అందకపోవడాన్ని వేణుగోపాలరావు గమనించారు. దీంతో అదేరోజు తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి మండల విద్యాశాఖ అధికారి అనుమతితో ఏజెన్సీని నియమించారు. అప్పుడు ఈ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 12 మందే. కాగా, మూడేళ్ల పాటు ఏకోపాధ్యాయునిగా పనిచేస్తూ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను 25కు పెంచారు. దీంతో ఈ పాఠశాలకు మరొక ఉపాధ్యాయ పోస్టును ప్రభుత్వం మంజూరు చేసింది. ఇక్కడ పనిచేస్తున్న కాలంలోనే ఎంపీపీఎస్ తోటపల్లి స్కూల్ కాంప్లెక్స్ సెక్రటరీగా ఎనిమిదేళ్లు వ్యవహరించి విద్యావ్యాప్తికి కృషి చేశారు. 2017 ఆగస్టులో ఎంపీపీఎస్ ఈదర మెయిన్ పాఠశాలకు బదిలీపై వచ్చారు. ఆ సమయంలో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 27 మాత్రమే. విద్యార్థులకు నాణ్యమైన బోధన అందిస్తూ గురుకుల పాఠశాలలో, నవోదయ సీట్లు సాధించడం వలన మూడేళ్లలోనే పాఠశాల రోల్ 137కి చేరింది. దీంతో 2020 సంవత్సరంలో జరిగిన బదిలీలల్లో ఈ పాఠశాలకు అదనంగా ఒక ఎల్ఎఫ్ఎల్, రెండు ఎస్జీటీ పోస్టులను ప్రభుత్వం మంజూరు చేయగా మొత్తం ఉపాధ్యాయుల సంఖ్య ఐదుకు చేరింది. మండలం మొత్తం మీద ఐదుగురు ఉపాధ్యాయులున్న ఏకైక ప్రాథమిక పాఠశాల ఇదే కావడం విశేషం. 2022 జూలైలో ఈ పాఠశాలలోని 3, 4, 5 తరగతులను హైస్కూల్‌లో కలపగా, అదే మండలంలోని సింహాద్రి అప్పారావుపేటలో నూతనంగా ప్రారంభించిన ఎంపీపీ పాఠశాలకు డిప్యుటేషన్‌పై వచ్చారు. అక్కడ కూడా ఈ విద్యా సంవత్సరంలో 48 మంది విద్యార్థులను చేర్పారు.

ఇంటింటికీ తిరిగి.. చైతన్యం నింపి

- ఉద్యోగంలో చేరిన నాటి నుంచి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయుడు మక్కే వేణుగోపాలరావు కృషి చేశారు.
- పాఠశాల ఆవాస ప్రాంతంలోని పేద, నిరుపేదల ఇళ్లకు తిరిగి తల్లిదండ్రుల్లో చైతన్యం నింపి ప్రభుత్వ పాఠశాలలో వారి పిల్లలను చేర్చేవారు.
- తాను పనిచేసే పాఠశాల ఆవాస ప్రాంతంలోని 5–10 ఏళ్ల లోపు వయస్సు పిల్లల వివరాలను సేకరించి, వారిలో చదువు మధ్యలో మానేసిన వారిని, పేద, నిరుపేద వర్గాల పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించేవారు
- 2002 నుంచి 2012 వరకు తాను పనిచేసే గ్రామంలోనే నివాసం ఉంటూ పిల్లల తల్లిదండ్రులకు అందుబాటులో ఉండేవారు. ఉదయం , సాయంత్రం వేళల్లో విద్యార్థులకు ఉచితంగా ట్యూషన్లు చెప్పేవారు
- ఏడో తరగతి చదివి మానివేసిన వారితో పదో తరగతిని ప్రైవేటుగా చదివించి, దూరవిద్య ద్వారా డిగ్రీలు చదివించేవారు. వారికి ప్రత్యేకంగా ట్యూషన్లు చెప్పేవారు
- విద్యార్థులను మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీవో, పోలీస్‌స్టేషన్, వ్యవసాయశాఖ తదితర ప్రభుత్వ కార్యాలయాలకు తీసుకెళ్లి విధులు, బాధ్యతలపై విద్యార్థులకు అవగాహన కల్పించేవారు
- ప్రతి ఏటా పాఠశాల విద్యార్థులను తన సొంత ఖర్చులతో విజయవాడలో నిర్వహించే బుక్ ఫెస్టివల్‌కు తీసుకెళ్లేవారు.
- తరగతిలో విద్యార్థులతో కూర్చుని పాఠాలు బోధిస్తారు. 3, 4, 5 తరగతుల విద్యార్థులకు ఇంగ్లిష్, గణితంలో నైపుణ్యాలను పెంచేవారు
- మెరిట్ విద్యార్థులకు బహుమతులు అందించి ప్రోత్సాహించేవారు
- దాతల సహకారంతో విద్యార్థులకు ప్రముఖుల జీవిత చరిత్రలకు సంబంధించిన పుస్తకాలను అందజేసేవారు
- 2022 సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఏలూరులో జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు అందుకున్నారు.

వృత్తే దైవంగా..



విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడం ఒక్క ఉపాధ్యాయుడికే సాధ్యం. అలాంటి వృత్తిని దైవంగా భావిస్తున్నాను. నిరుపేద పిల్లల జీవితాల్లో వెలుగులు నింపినప్పుడే ఈ వృత్తికి న్యాయం చేసిన వారమవుతాం. తల్లిదండ్రులను చైతన్యపరిచి వారి పిల్లలను పాఠశాలల్లో చేర్చేవాడిని. ప్రస్తుత ప్రభుత్వం నాడు–నేడు కార్యక్రమంతో గత 75 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా పాఠశాలలను అభివృద్ధి చేసింది. పాఠ్యపుస్తకాల్లోని కంటెంట్ కూడా గతంలో ఎన్నడూ లేని విధంగా విద్యార్థులకు అందుబాటులోకి వచ్చింది. పాఠాలు నేర్పడంలో ఉండే సంతృప్తి ఉపాధ్యాయుడికి ఎందులోనూ దొరకదు.

– మక్కే వేణుగోపాలరావు, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు, ఆగిరిపల్లి మండలం

శ్రీరామనవమి వేడుకల్లో అపశ్రుతి



దువ్వలోని ఆలయ ప్రాంగణంలో ఎగిసి పడుతున్న మంటలు

- దువ్వ వేణుగోపాలస్వామి ఆలయంలో అగ్నిప్రమాదం
- చలువ పందిళ్లు దగ్ధం.. పరుగులు పెట్టిన భక్తులు

తణుకు: తణుకు మండలం దువ్వ గ్రామంలో వేంచేసియున్న వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం నిర్వహించిన శ్రీరామనవమి వేడుకల్లో అపశ్రుతి చోటు చేసుకుంది. ఆలయంలో సీతారాముల కల్యాణానికి ఏర్పాట్లు జరుగుతుండగా అగ్నిప్రమాదం సంభవించి చలువ పందిళ్లు దగ్ధమయ్యాయి. కాగా ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.3 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. గ్రామంలోని ప్రసిద్ధి చెందిన ఈ ఆలయ ప్రాంగణంలో శివాలయం, కేశవస్వామి, వేణుగోపాలస్వామి, సీతారామస్వామి, ముడియాలమ్మ దేవాలయాలు ఉన్నాయి. ఇటీవల శివరాత్రిని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో తాటాకులతో చలువ పందిళ్ల నిర్మించారు. 15 రోజుల అనంతరం వేణుగోపాలస్వామి తీర్థం జరిగింది. ప్రస్తుతం శ్రీరామనవమి సందర్భంగా స్వామివారి కల్యాణం వరకు చలువ పందిళ్ల కొనసాగిస్తుంటారు. ఈ క్రమంలో గురువారం సీతారాముల కల్యాణానికి ముందు స్వామివారి ఊరేగింపులో భాగంగా ఎదురు సన్నాహం నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న సమయంలో ఒక్కసారిగా చలువ పందిళ్లకు మంటలు రాజుకున్నాయి. ఈ హఠాత్పరిణామానికి ఆలయ ప్రాంగణంలో ఉన్న భక్తులు, గ్రామస్తులు ఆందోళనతో పరుగులు తీశారు. నిమిషాల వ్యవధిలోనే మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. మంటల ధాటికి పరిసర ప్రాంతాల్లో కొబ్బరి చెట్లు సైతం అగ్నికి ఆహుతయ్యాయి. ప్రమాదం కారణంగా గ్రామంలోని కేశవస్వామి ఆలయ ప్రాంగణంలో సీతారాముల కల్యాణాన్ని పూర్తి చేశారు. షార్ట్‌సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగిందని దేవస్థానం ఈఓ పిల్లి సూర్యనారాయణ చెప్పారు. ఆలయ సంప్రోక్షణ అనంతరం దర్శనానికి అనుమతి ఇస్తామని పేర్కొన్నారు.

మద్దిలో నేత్రపర్వంగా సీతారాముల కల్యాణం



మద్దిలో సీతా రాముల కల్యాణాన్ని నిర్వహించిన అర్చకులు

జంగారెడ్డిగూడెం రూరల్: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని గురవాయిగూడెంలోని శ్రీమద్ది ఆంజనేయస్వామి వారి క్షేత్రంలో సీతారాముల కల్యాణం నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేద పండితులు ఘనంగా స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి కల్యాణాన్ని వీక్షించారు. పానకాన్ని భక్తులకు ప్రసాదంగా అర్చకులు పంపిణీ చేశారు. ఆలయ ధర్మకర్తలు మానికల బ్రహ్మానందరావు, బల్లే నాగలక్ష్మీ,ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మద్ది దేవస్థానం నుంచి మైసన్నగూడెం, జంగారెడ్డిగూడెం పట్టణం, చల్లవారిగూడెం గ్రామాల్లో రామాలయాలకు పట్టువస్త్రాలు, ప్రసాదాలు, పూజా సామాగ్రి పంపిణీ చేశారు. తిరుమలాపురంలో శ్రీ భోగ సుందర సీతారామ స్వామి వారి ఆలయంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. కనుపర్తి రామకృష్ణ, లక్ష్మీ పవనకుమారి దంపతుల చేతుల మీదుగా అర్చకులు వేదాంతం శ్రీనివాసాచార్యులు వేదోక్తంగా కల్యాణం నిర్వహించారు. ఎంపీపీ కొదమ జ్యోతి, పద్మరాజు దంపతులు కల్యాణంలో పాల్గొన్నారు.

పలువురిపై అట్రాసిటీ కేసు నమోదు

నూజివీడు : జంగంగూడెంలో పలువురిని కులంపేరుతో దూషించినందుకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై తలారి రామకృష్ణ చెప్పారు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన తొమ్మండ్రు రమేష్ జంగంగూడెం పంచాయతీ కార్యాలయంలో గుమస్తాగా పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం 8 గంటల సమయంలో సర్పంచ్ ఇంటి ఎదురుగా వీఆర్వోతో పాటు మరికొంత మంది గుమికూడి ఉండటంతో అక్కడ గొడవ జరుగుతుందని గమనించి అక్కడికి వెళ్లాడు. అదే గ్రామానికి చెందిన పాటిమీద రామకృష్ణ, హనుమంతరావు, సుబ్బారావు, శ్రీను, సుబ్బయ్య, గోపాలరావు, శ్రీకాంత్, రవి, రమేష్, రాము, నవీన్ మరికొందరు వీఆర్వోతో వాదులాడుతున్నారు. దీంతో రమేష్ ఏమైందని వారిని అడగగా కులంపేరుతో దూషించి, చంపుతామంటూ బెదిరించారు. దీంతో రమేష్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మండల మేజిస్ట్రేట్ ఉత్తర్వులు బేఖాతర్

నూజివీడు: జంగంగూడెంలో 145 సెక్షన్ అమలులో ఉన్న స్థలంలోకి వెళ్లి మండల మెజిస్ట్రేట్ ఉత్తర్వులను ఉల్లంఘించడమే కాక వీఆర్వోను అడ్డగించడం, బెదిరించడం, విధులకు అటంకం కలిగించిన నేరాలపై టీడీపీకి చెందిన 20 మందికి పైగా వ్యక్తులపై రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. రూరల్ ఎస్ఐ తలారి రామకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని ఆర్ఎస్ నంబర్ 141లో 5 సెంట్ల భూమి గ్రామకంఠంగా రెవెన్యూ రికార్డుల్లో నమోదై ఉంది. ఈ భూమి విషయమై ఇరువర్గాలు గతంలో గొడవ పడగా, శాంతి భద్రతలకు భంగం వాటిల్లే ప్రమాదం నెలకొనడంతో తహసీల్దార్ డీవీఎస్ యల్లారావు సీఆర్‌పీసీ 145 సెక్షన్ విధించారు. దీని ప్రకారం ఈ స్థలంలోకి ఎవరూ వెళ్లడానికి అనుమతి లేదు. ఇదిలా ఉండగా, శ్రీరామనవమి సందర్భంగా టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పాటిమీద హనుమంతరావు వర్గం గురువారం ఉదయం ఈ స్థలంలో సీతారాముల ఫొటో కుర్చీలో పెట్టి పూజలు చేస్తున్నారు. దీంతో రెండో వర్గం అందించిన సమాచారంతో పోలీసు సిబ్బంది, వీఆర్వో కె.దుర్గామల్లేశ్వరి ఈ వివాదాస్పద స్థలం వద్దకు చేరుకున్నారు. ఈ స్థలాన్ని వెంటనే ఖాళీ చేసి వెళ్లిపోవాలని అక్కడ ఉన్న పాటిమీద హనుమంతరావు, పాటిమీద రామకృష్ణ, పాటిమీద రవి, పాటిమీద గోపాలరావు, పాటిమీద నవీన్, పాటిమీద సుబ్బయ్య, పాటిమీద శ్రీను, పాటిమీద సుబ్బారావు, పాటిమీద ఉమామహేశ్వరరావు, పాటిమీద రాము, పాటిమీద నాగసునీత, పాటిమీద ధనలక్ష్మి, పాటిమీద అనురాధ, పాటిమీద ఝాన్సీ, పాటిమీద వెంకటేశ్వరమ్మ, పాటిమీద నాగపద్మావతి, పాటిమీద సత్యవతి, పాటిమీద శారద, మరికొంత మంది ఉండగా వారికి వీఆర్వో సూచించారు. అయినప్పటికి వారు వినకుండా మీరు చేసుకునేది చేసుకోండంటూ వీఆర్వోను దూషించడమే కాక, స్థలంలోని వెళ్లిపోవాలని, లేదంటే మీ అంతు చూస్తామంటూ బెదిరించారు. దీంతో వీఆర్వో రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఆమె ఫిర్యాదు మేరకు ఎస్సై తలారి రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వివాదాస్పద స్థలంలోకి ప్రవేశించిన వారిని ఖాళీ చేయాలని హెచ్చరిస్తున్న పోలీసులు

సృజనాత్మకత వెలికితీతకు కళలు దోహదం

ఆర్జీయూకేటీ వైస్ చాన్సలర్ ఆచార్య ఎం.విజయ్‌కుమార్



పెన్సిల్ ఆర్ట్స్‌లను తిలకిస్తున్న ఆర్జీయూకేటీ వైస్ చాన్సలర్ ఆచార్య ఎం.విజయ్‌కుమార్

నూజివీడు: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు, ఆత్మస్థైర్యాన్ని పెంపొందింప చేయడానికి కళలు ఎంతగానో దోహదపడతాయని రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) వైస్ చాన్సలర్ ఆచార్య ఎం.విజయ్‌కుమార్ అన్నారు. స్థానిక ట్రిపుల్‌ఐటీలోని శ్రీకాకుళం క్యాంపస్‌కు చెందిన ఫైన్ ఆర్ట్స్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను గురువారం వైస్ చాన్సలర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గీచిన చిత్రాలు వారిలో ఉన్న సృజనాత్మకతకు అద్దం పట్టేలా ఉన్నాయన్నారు. క్యాంపస్‌లో ఉన్న అధ్యాపకులు, విద్యార్థులందరూ ఈ ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను తిలకించి వారిలో నూతనోత్తేజాన్ని పెంపొందింపచేయాలన్నారు. ఎగ్జిబిషన్‌లో పెన్సిల్ ఆర్ట్, మండానా ఆర్ట్, పోర్ట్రెయిట్ ఆర్ట్, పోస్టర్ కలర్ ఆర్ట్, పెన్ ఆర్ట్స్, వాటర్ కలర్ ఆర్ట్ విభాగంలో విద్యార్థులు గీచిన చిత్రాలను ప్రదర్శించారు. మొదటి ఐదు స్థానాల్లో విజేతలైన విద్యార్థులకు నగదు బహుమతులను అందజేశారు. 28 మంది విద్యార్థులు గీచిన పెన్సిల్ ఆర్ట్స్‌ను, వైవిధ్య ఆర్ట్స్‌ను ప్రదర్శనలో ఉంచారు. నూజివీడు డైరెక్టర్ ఆచార్య జీవీఆర్ శ్రీనివాసరావు, మోహన్‌రావు, ఎం.రామకృష్ణ, సతీష్, ఆర్ట్ ఇన్‌స్ట్రక్టర్ పీ శివశంకర్, అకడమిక్ కో–ఆర్డినేటర్ చిన్నారావు పాల్గొన్నారు.

స్పెల్ బీలో సత్తా చాటిన విద్యార్థులు





స్పెల్‌బీలో గోల్డ్‌మెడల్ సాధించిన భీమ గంగాధర్, మాథ్స్‌బీలో బ్రాంజ్ మెడల్ అందుకుంటున్న ధర్మ దినేష్

జంగారెడ్డిగూడెం: సాక్షి ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న స్పెల్‌బీ, మాథ్స్ బీ పోటీల్లో పట్టణంలోని ప్రతిభ పాఠశాల విద్యార్థులు భీమ గంగాధర్, ధర్మ దినేష్ విజేతలుగా నిలిచినట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ కాసర సరోజారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ సుభాష్ రెడ్డి చెప్పారు. వివరాలు ఇలా ఉన్నాయి. సాక్షి ఆధ్వర్యంలో స్పెల్‌బీ, మాథ్స్ బీ పోటీలను ఏటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో పాఠశాల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పోటీలను నిర్వహించారు. ఆయా దశలను విద్యార్థులు విజేతగా నిలిచి ఈ నెల 28, 30 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించిన ఫైనల్ పోటీల్లో పాల్గొన్నారు. 28న నిర్వహించిన మాథ్స్‌బీ ఫైనల్స్‌లో పాల్గొన్న ధర్మ దినేష్ మూడో స్థానం సాధించి బ్రాంజ్ మెడల్‌ను సొంతం చేసుకున్నాడు. 30న నిర్వహించిన స్పెల్‌బీ ఫైనల్‌లో భీమ గంగాధర్ పాల్గొని విజేతగా నిలిచి గోల్డ్ మెడల్ సాధించాడు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కాసర సరోజారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు భీమగంగాధర్, ధర్మ దినేష్ ఘనవిజయాన్ని సాధించి జంగారెడ్డిగూడెంకు గర్వకారణంగా నిలిచారన్నారు. విద్యార్థులకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

క్లుప్తంగా

ముత్యాలమ్మకు వెండి సమర్పణ



ముత్యాలంబాపురం శ్రీముత్యాలమ్మ చీరకు వెండిని అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ముత్యాలంబపురం ముత్యాలమ్మవారికి వెండి చీర నిమిత్తం తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన గొర్లి సూర్యనారాయణ – అప్పాయమ్మ దంపతులు అరకిలో వెండిని గురువారం ఆలయ కమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా దాతల పేరిట అమ్మవారికి పూజలు జరిపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మాకా బాలాజీ, ఆలయ కార్య నిర్వహణ అధికారి పి.హరేరాంప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ హరిబాబు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

ఘనంగా శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న కారుమూరి సునీల్‌కుమార్, యువత

తణుకు అర్బన్: రామనవమి సందర్భంగా తణుకులో నిర్వహించిన శోభాయాత్రతో తణుకు రాష్ట్రపతి రోడ్డు భక్తసంద్రమైంది. భారీగా బైక్ ర్యాలీకి ప్రజలు, భక్తులు తరలిరావడంతో వీధులన్నీ కిక్కిరిసిపోయాయి. పైడిపర్రు నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీ ఆర్వోబీ, రాష్ట్రపతి రోడ్డు మీదుగా నరేంద్ర సెంటర్‌కు చేరుకుంది. దారిపొడవునా జై శ్రీరామ్ నినాదాలు హోరెత్తాయి. రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు తనయుడు, యువనేత కారుమూరి సునీల్‌కుమార్ శోభాయాత్రలో పాల్గొన్నారు. బైక్‌పై యువతతో కలిసి ర్యాలీలో సందడి చేశారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చడానికి ఉచితంగా చలివేంద్రాలను నిర్వహించడం ఎంతో అభినందనీయమని ప్రముఖ వైద్యులు డా. తానేటి శ్రీనివాస్ అన్నారు. శ్రీరామ నవమి సందర్భంగా బస్టాండ్ సమీపంలో చైతన్య ఎమర్జెన్సీ ఆసుపత్రి నిర్వాహకులు కె.సోమేశ్వరరావు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తానేటి శ్రీనివాస్ ప్రారంభించారు. పానకం పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో వైద్యులు, వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.

దొరలక్ష్మి మృతికి సంతాపం



సంతాపం వ్యక్తం చేస్తున్న సీపీఐ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): సీపీఐ సభ్యురాలు కామ్రేడ్ ఎం.దొరలక్ష్మి మృతికి గురువారం పట్టణంలో జరిగిన సంతాప సభలో సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.సీతారాం ప్రసాద్, పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరరావు, జాన్‌రాజులు సంతాపం వ్యక్తం చేశారు. దొరలక్ష్మి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎం.గంగాచలం, సత్యనారాయణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఉండి: ఉండి సెంటర్ సమీపాన గణపవరం రోడ్డు కార్నర్‌లో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్రగాయాలయ్యాయి. ఉండి సెంటర్‌నుంచి గణపవరం వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని మినీ వ్యాన్ ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న వారికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల 108కు సమాచారం ఇవ్వడంతో బాధితులను చికిత్స నిమిత్తం భీమవరం ఆస్పత్రికి తరలించారు. అయితే ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న వెంటనే మినీ వ్యాన్ డ్రైవర్ వ్యాన్‌ను విడిచిపెట్టి పారిపోయినట్లు స్థానికులు తెలిపారు. అయితే ఈ ప్రమాదంపై బాధితుల వివరాలపై ఇంకా సమాచారం అందాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

కోడి పందేల శిబిరంపై దాడి

పాలకోడేరు: మండలంలోని గరగపర్రులో కోడిపందాల స్థావరంపై ఎస్సై ఎస్.శ్రీనివాసరావు గురువారం సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి ఒక కోడి ఒక కోడి కత్తి రూ.1500 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

రమణీయం.. సీతారాముల కల్యాణం



తాడేపల్లిగూడెం మండలం బంగారుగూడెం రామాలయం వద్ద కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



సుబ్బారావుపేట రామాలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవం దృశ్యం



తణుకు ఎన్జీవో హోంలో శ్రీ రామ నవమి సందర్భంగా కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ తదితరులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలో శ్రీరామనవమి వేడుకలు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బంగారుగూడెం గ్రామంలోని రామాలయం వద్ద పెనుగొండ రాజు– లీలా కోమలి, బొట్టా సత్యనారాయణ–జయలక్ష్మి దంపతులు పీటలపై కూర్చొని శ్రీసీతారాముల కల్యాణాన్ని జరిపించారు. అలాగే చినతాడేపల్లి, పెదతాడేపల్లి, వెంకట్రామన్న గూడెం, జగ్గన్నపేట, కడియద్ద, నీలాద్రిపురం, కొమ్ముగూడెం, పట్టింపాలెం, వీరంపాలెం, అప్పారావుపేట, కృష్ణాపురం, మాధవరం, నవాబుపాలెం, కృష్ణాయపాలెం, దండగర్ర, ఉప్పరగూడెం, మోదుగగుంట, గొల్లగూడెం తదితర గ్రామాల్లోని రామాలయాలను భక్తులు దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయా ఆలయాల వద్ద సీతారాముల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. బంగారుగూడెం, మోదుగ గుంట, వెంకట్రామన్న గూడెం గ్రామాల్లోని రామాలయం వద్ద అన్నసమారాధన ఏర్పాటు చేశారు. బంగారుగూడెం గ్రామంలోని రామాలయం వద్ద ఆలయ కమిటి అధ్యక్షుడు ముప్పిడి మురళీరెడ్డి, కార్యదర్శి నిడదవోలు సత్యనారాయణ, ప్రధాన సలహాదారులు చుండ్రు నరసింహమూర్తి, బుర్ల శేషయ్య, సక్కా రాజు, మాకిరెడ్డి నెహ్రూరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

పట్టణంలో అంగరంగ వైభవంగా సీతారాముల కల్యాణ మహోత్సవాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో సీతారాముల కల్యాణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా గురువారం ఆయా ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో జరిపించారు. మహోత్సవాలకు వచ్చిన భక్తులకు వడపప్పు, పానకం అందించారు. పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ అమ్మవారి ఆలయం వద్ద ఆలయ కమిటీ చైర్మన్ కొట్టు అంజిబాబు ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం కనులపండువుగా జరిగింది. సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్‌బాబు దంపతులు హాజరైయారు. వాసవి కన్యకా పరమేశ్వరీ పంచాయతన క్షేత్రంలో ఆర్యవైశ్య గౌరవాధ్యక్షుడు మారం వెంకటేశ్వరరావు నేతృత్వంలో సీతారాముల కల్యాణం జరిగింది. 5 వేల మందికి అన్నప్రసాదాలు, పానకం, వడపప్పు అందించారు. నందిబలమ్మ రామాలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవంలో దేవాదాయ ధర్మదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ హాజరై స్వామి వారిని దర్శించి పూజలు జరిపారు. సుబ్బారావుపేటలోని కోదండ రామాలయంలోను, శాలిపేట రామాలయంలోను, విద్యుత్ సబ్‌స్టేషన్‌లో రామాలయంలోను, పాతూరులోని పలు రామాలయంలోను, పశువుల ఆసుపత్రి రోడ్డులో రామాలయంలోను, గొల్లగూడెం సెంటర్ పురాతన రామాలయంలోను, చిన్నవంతెన వద్ద వేంచేసియున్న రామాలయంలోను, హౌసింగ్‌బోర్డు కాలనీ సువర్చల అభయాంజనేయస్వామి వారి ఆలయంలో శ్రీరామ నవమి సందర్భంగా బచ్చు ఫణికుమార్, ప్రసన్నలక్ష్మి దీపిక దంపతులచే స్వామివారికి నూతన దర్బార్ సింహాసనాన్ని, ఉమా మహేశ్వరి దేవిచే మూడు కేజీల రజత కిరీటం బహుకరించారు. ఆలయ ధర్మకర్త ఆకుల నరసింహమూర్తి పర్యవేక్షించారు. సీతారాంపేట శ్రీరామాలయంలో నవమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయ కమిటీ అధ్యక్షుడు నరిశే సోమేశ్వరరావు పూజలను పర్యవేక్షించారు.

ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

తాడేపల్లిగూడెం అర్బన్ : శ్రీరామనవమి సందర్భంగా స్థానిక ద్వారకా నగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద సీతారాముల కల్యాణం గురువారం నిర్వహించారు. ఈ వేడుకల్లో డీపీఓ మల్లికార్జునరావు, పవన్‌కుమార్, బొల్లం నాగరాజు, జగదీష్, తాత నాగేశ్వరరావు, బాలగోపాలచంద్రరాజు దంపతులతో పాటు స్థానికులు 16 మంది దంపతులు పాల్గొన్నారు. కల్యాణం అనంతరం భక్తులకు పానకం పంపిణీ చేశారు. శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయ వద్ద రాముని కల్యాణానికి విచ్చేసిన భక్తులందరికి తమవంతు కృతజ్ఞతలు ఆలయకమిటి సభ్యులు జగదీష్ తెలిపారు. అదేవిధంగా ప్రతీ పండుగ పర్వదినాల్లో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. భక్తులు, స్థానికులు తమవంతు సహకారం అందించాలని కోరారు.

పానకం పంపిణీ

తాడేపల్లిగూడెం అర్బన్ : శ్రీరామనవమిని పురస్కరించుకొని జువ్వలపాలెంలోని రాధాకృష్ణ కామధేను సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం భక్తులకు పానకం పంపిణీ చేశారు. జువ్వలపాలెం వద్ద నుంచి రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులకు శ్రీరామనవమి సందర్భంగా పానకాన్ని అందజేశారు. సేవా సమితి ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సంఘ సభ్యులు తెలిపారు.

ఘనంగా సీతారాముల కల్యాణోత్సవాలు

తణుకు టౌన్: తణుకు మండలంలోని వివిధ గ్రామాల్లోని ఆలయాల్లో రాముని కల్యాణోత్సవాలు ఘనంగా నిర్వహించారు. గురువారం తణుకులోని తాలూకా ఎన్జీవో సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కల్యాణోత్సవంలో ఎన్జీవో సంఘం నాయకుడు వైవీఎస్‌టీ రాయుడు దంపతులు శ్రీ సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించారు. తణుకు మున్సిపల్ కార్యాలయం వద్ద గల కాపుల రామాలయం వద్ద జరిగిన కల్యాణోత్సవంలో డా.రుద్ర గౌతమ్ నరేష్, డాక్టర్ లక్ష్మీదివ్యమంజరిలు సీతారాముల కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు కుమారుడు కారుమూరి సునీల్ కుమార్, మాజీ ఏఎంసీ చైర్మన్ చిట్టూరి సుబ్బారావు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ వావిలాల సరళాదేవి, వెంకట రమేష్, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పోలేపల్లి వెంకట ప్రసాద్, నాయకులు ఎస్ఎస్ రెడ్డి, తిర్రే విజయకృష్ణ, ఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాసరావు, కార్యదర్శి తణుకు తాలూకా అధ్యక్షుడు కేఎస్‌వీ నరసరాజు, కార్యదర్శి కేవీ సత్యనారాయణ, శ్రీనివాసరావు, సుభాషిణి, పీ శ్రీనివాసులు, పీవీ రమణ, నాయకులు విడివాడ రామచంద్రరావు, బెజవాడ సూరిబాబు, లయన్స్ క్లబ్ నాయకులు దామెర రంగారావు, పి నాగభూషణం, అందే నాగయ్య, టీఎస్ పద్మావతి, ఆలయ కమిటీ సభ్యులు కోన రమేష్, బాపన్న తదితరులు పాల్గొన్నారు. తణుకు రూరల్ మండలం తేతలిలో ప్రసిద్ధి చెందిన సీతారామచంద్ర స్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ బోర్డు చైర్మన్, సభ్యులు పాల్గొన్నారు. వేల్పూరు గ్రామంలోని వివిధ రామాలయాల వద్ద శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. దువ్వ గ్రామంలో వివిధ ఆలయాలవద్ద శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

వైభవంగా రామనవమి వేడుకలు

పెంటపాడు: మండలంలో గురువారం శ్రీరామనవమి వేడుకలు పలు గ్రామాల్లో వైభవంగా ప్రారంభమయ్యాయి. పెంటపాడులోని పాత పంచాయతీ వద్ద పురాతన శ్రీరామబాలభక్తసంఘం, కాపుల రామాలయం, వెలంపేట రామాలయం, రెడ్ల రామాలయం, శెట్టిబలిజపేట రామాలయం, పూరిగుడి రామాలయం, ఎస్సీపేట రామాలయంతో పాటు, కె. పెంటపాడులోని బుడగా జంగాల పేటలో ఉన్న రామాలయం, ప్రత్తిపాడు కోదండ రామాలయం, మీనవిల్లూరులోని శ్రీరామాలయం, అలంపురం, జట్లపాలెం, ఆకుతీగపాడు, యానాలపల్లి, కొండేపాడు, విప్పర్రు తదితర రామాలయాలలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆయా ప్రాంతాల్లో పానకాలు పంపిణీ చేశారు.



తాడేపల్లిగూడెం మండలం ద్వారకానగర్‌లో సీతారామ కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



జువ్వలపాలెం వద్ద పానకం పంపిణీ చేస్తున్న దృశ్యం



బైరాగిమఠంలో హరే శ్రీనివాసా కోలాటం ఆడుతున్న చిన్నారులు

ప్రతి వ్యక్తికీ శ్రీరామచంద్రుడు ఆదర్శం కావాలి

- దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ
- కె.పెంటపాడులో శ్రీరామనవమి వేడుకలకు కుటుంబంతో హాజరు
- దేవేరులకు పట్టువస్త్రాలు, తలంబ్రాలు అందజేత



కల్యాణం అనంతరం మాట్లాడుతున్న కొట్టు సత్యనారాయణ

పెంటపాడు: ఏకపత్నీ వ్రతుడు, ధర్మబద్ధంగా నడిచే మార్గం చూపిన శ్రీరామచంద్రుని ఆశయాలకు అనుగుణంగా ప్రతి వ్యక్తీ నడవాలని ఉపముఖ్యమంత్రి, దేవదాయశాఖామంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. కె.పెంటపాడులోని బైరాగిమఠంలో గోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం నిర్వహించిన సీతారాముల కల్యాణోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ మానవులందరిలో ఉత్తముడు శ్రీరాముడు అని పురాణ, ఇతిహాసాలు చెబుతున్నాయన్నారు. భక్తిభావంతో ప్రతి వ్యక్తి తన నడవడికను ధర్మబద్ధం చేసుకోవాలన్నారు. సీతారాముల కల్యాణం తిలకించే భాగ్యం కలగడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఏ ప్రభుత్వమైతే ప్రజారంజకంగా పాలన సాగిస్తుందో అది రామరాజ్యంగా కొనియాడబడుతుందన్నారు. ప్రజల అవసరాలు తీరుస్తూ వారిని కన్నబిడ్డల్లా చూసే ఒక మంచి పరిపాలనకు నిదర్శనం అలనాడు స్వర్గీయ వైఎస్ రాజశేఖరెడ్డితో పాటు, నేడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమని మంత్రి అన్నారు. నేడు హిందూ ధర్మ పరిరక్షణకోసం పెద్ద ఎత్తున కోట్లాది రూపాయలు వెచ్చించి ప్రతి గ్రామంలోనూ హిందూ ఆలయాలు నిర్మించాలనుకోవడం సీఎం జగనన్న హిందూ ధర్మ పరిరక్షణ దక్షతకు ఒక నిదర్శనమన్నారు. రాష్ట్రంలో ఉన్న 3 వేల దేవాలయాల పునర్జీవం కోసం నిధులు వెచ్చించే కార్యక్రమానికి జగనన్న శ్రీకారం చుట్టారన్నారు. వాటి నిర్మాణమే లక్ష్యంగా పెట్టుకుని ఒక్కో ఆలయానికి రూ. 10 లక్షలు అందించేందుకు దేవాదాయశాఖ ఆధ్వర్యంలో కృషి జరుగుతోందన్నారు. దీంతో పాటు ప్రతి గ్రామంలోనూ దేవాలయ సేవ జరిగి, మంత్రోచ్ఛారణ, వేదఘోషతో పాటు, గ్రామం సుభిక్షంగా ఉండేందుకు గాను ఆలయాల్లో దూపదీప నైవేద్యాల కోసం ఎంతో సొమ్ము వెచ్చిస్తున్నామన్నారు. ఈ పథకాన్ని పొడిగించేందుకు కూడా కృషి జరుగుతోందన్నారు. దేవదాయశాఖా మంత్రిగా తనకు జగనన్న అప్పగించిన బాధ్యతను ఒక వరంగా భావించి దేవాదాయాల అభివృద్ధికి కోట్లాది రూపాయలు అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు సత్యనారాయణ, సౌదామిని దంపతులు, కుమారుడు కొట్టు విశాల్, కుమార్తె కాంచన్‌లతో పాటు, మనుమలతో ఆయన స్వామివారి కల్యాణం ఆసాంతం తిలకించారు. స్వామివారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. ఆలయ ఈవో చీమలకొండ సాయి, పార్టీ నాయకులు, భారీ దండ, పూర్ణకుంభంతో మంత్రికి స్వాగతం పలికారు. యువనేత కొట్టు విశాల్, పార్టీ అధ్యక్షుడు కై గాల శ్రీనివాస్, మండల వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు కట్టు బోయిన కృష్ణప్రసాద్, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేస్తా

కె.పెంటపాడులోని వేణుగోపాలస్వామి ఆలయానికి రూ.1 కోటి ఖర్చుతో కల్యాణ మండపం మంజూరు చేశామని, త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు మంత్రి కొట్టు సత్యనారాయణ చెప్పారు. ఆలయం వెలుపల ప్రతి ఏడాది కల్యాణం చేసేందుకు మండపం కట్టించేలా అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక మాస్టర్ ప్లాన్, శాస్త్రం ప్రకారం నిర్మాణాల కోసం కృషి చేస్తామన్నారు. తొలుత వేణుగోపాల స్వామివారి ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. సుమారు 10 గ్రామాల నుంచి 12 వేల మంది భక్తులు పాల్గొని కల్యాణం తిలకించి అన్నసమారాధనలో పాల్గొన్నారు.

సీట్ ద్వారానే ఐఈడీ విద్యా అవగాహన సాధ్యం



ఐఈడీ విద్యావిధాన మాన్యువల్ బుక్ ఆవిష్కరించిన మంత్రి కొట్టు సత్యనారాయణ

పెంటపాడు: లైంగిక విద్యలో అవగాహన శిక్షణ(సీట్)పై బేసిక్‌స్కూలు విలీన విద్యా ఉపాధ్యాయురాలు సాయిస్వరూప 10 ఏళ్లపాటు కష్టపడి అవగాహనతో రచించిన బుక్‌ను రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ బుధవారం ఆవిష్కరించారు. ఆ వివరాలను ఉపాధ్యాయురాలు సాయి స్వరూప శుక్రవారం వివరించారు. మేధో వైకల్యం కలిగిన యుక్తవయస్సు విద్యార్థినులు ఎదుర్కొంటున్న లైంగిక విద్యలో అవగాహన శిక్షణపై తాను మేధావుల సూచనలతో పుస్తకం రాసినట్లు తెలిపారు. కాగా దివ్యాంగులైన పిల్లలను లైంగికంగా లోబరచుకొనేవారిని ఎలా నిరోధించాలో వారికి తెలియజేసేందుకు ఈ పుస్తకం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. పుస్తకం రచించిన సాయి స్వరూపను ప్రత్యేకంగా మంత్రి కొట్టు సత్యనారాయణ అభినందించారని స్వరూప తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దాసరి హైమావతి, హెచ్ఎం ఏవీఎస్‌వీ ప్రసాద్, ఇన్‌చార్జి హెచ్ఎం రాజేష్, ఎంఈవో ఎం. శ్రీనివాస్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేటితో పేరంటాలమ్మ ఉత్సవాలు ముగింపు

ఉండి: మండలంలోని వెలివర్రులో ఉన్న వీరపేరంటాలమ్మ అమ్మవారి 70వ వార్షిక మహోత్సవాలు 31వ తేదీ శుక్రవారంతో ముగియనున్నట్లు ఆలయ చైర్మన్ మంతెన రంగరాజు తెలిపారు. దీనిలో భాగంగా శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో అఖండ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ పెన్మత్స అంజనీదేవి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు ముదునూరి కొండరాజు, ఆలయ మాజీ చైర్మన్ కోళ్ళపల్లి సతీష్‌రాజు తెలిపారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు ఆలయం వద్ద స్థానిక మహిళలతో నిర్వహించే లలితాసహస్ర నామపారాయణ కార్యక్రమంతో చివరి రోజు కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు.

ఎండీయూ సభ్యుల సమస్యలు పరిష్కరించాలి



సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నినాదాలు చేస్తున్న ఎండీయూ నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మొబైల్ డిస్పెన్సరీ యూనిట్ (ఎండీయూ) సభ్యుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని యూనిట్ జిల్లా ఉపాధ్యక్షుడు రావి వెంకట కనక దుర్గా వర ప్రసాద్, టౌన్ అధ్యక్షుడు ఎస్‌కే నాగబాబులు కోరారు. పట్టణంలో గురువారం విలేకర్లతో మాట్లాడుతూ ఇంటింటికి బియ్యం సరఫరా చేసే మినీ ట్రక్కులపై 90 శాతం సబ్సిడీ ఇస్తామని చెప్పారని, పురోగతి లేదని వాపోయారు. వాహనాల బీమా చెల్లింపులు ప్రభుత్వమే భరిస్తుందని చెప్పారని, వాస్తవంలో బ్యాంక్ ఆఫ్ బరోడా యాజమాన్యం తమ జీతాలు నుంచే ముందస్తుగా తీసుకుంటున్నారన్నారు. బియ్యం అందించే సమయంలో వలంటీర్లు తమకు సహకరించడం లేదని, దీంతో తమపై భారాలు పడుతున్నాయన్నారు. ఈ–పాస్ మిషన్స్‌లో వాడే పేపర్ ఖర్చు కూడా తమపై పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గ పరిధిలో ఎండీయూ సభ్యులు పాల్గొన్నారు.

నారాయణస్వామి మృతి తీరని లోటు



నారాయణ స్వామి పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

తణుకు టౌన్: రాష్ట్ర మాజీ మంత్రి సీనియర్ రాజకీయ నాయకుడు యర్రా నారాయణ స్వామి మృతి పట్ల ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ సంతాపం తెలిపారు. నారాయణ స్వామి తన తండ్రి వంకా సత్యనారాయణతో ఎమ్మెల్యేగా శాసన సభ సమావేశాల్లో పాల్గొన్నారని ఆయన గుర్తు చేశారు. నారాయణ స్వామిని నెల క్రితం కలిసినట్లు పేర్కొన్నారు. నారాయణ స్వామి ఎమ్మెల్యేగా, మంత్రిగా, జిల్లా పరిషత్ చైర్మన్‌గా, పార్లమెంటు సభ్యులుగా జిల్లాకు చేసిన సేవలు మరువలేమని పేర్కొన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

తాడేపల్లిగూడెం (టీఓసీ): మాజీ రాజ్యసభ సభ్యులు, మాజీ మంత్రి యర్రా నారాయణ స్వామి మృతికి పేరిచర్ల ఫౌండేషన్ చైర్మన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు, ఏపీ నాటక పరిషత్ సమాఖ్య అధ్యక్షుడు బుద్దాల వెంకట రామారావు, మజ్జి సంగం నాయుడులు సంతాపం తెలిపారు. ఉండి మండలం ఉప్పులూరు గ్రామంలో యర్రా నివాసం వద్ద పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): అత్యవసర మరమత్తుల నేపథ్యంలో శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.వెంకటేశ్వరరావు వెల్లడించారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటలకు ఏరియా ఆసుపత్రి, చెట్లు రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపు పెన్నాడలో ఈఓపీఆర్‌డీ విచారణ

పాలకోడేరు: అంధుడైన తనను భార్య బలవంతంగా బెదిరించి ఇంటి నుంచి గెంటివేసిందని, ఆపై తన ఇంటి పన్నును తన పేరు పై మార్చి వేసుకుందని ఇందుకు అధికారులు సహకరించారని, పెన్నా డ గ్రామానికి చెందిన చీరా వెంకట సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం ఉదయం 11 గంటలకు సచివాలయం 1 వద్ద విచారణ నిర్వహిస్తామని పాలకోడేరు మండల ఈఓపీఆర్‌డీ రెడ్డయ్య గురువారం విలేకరులకు తెలిపారు. ఈ మేరకు బాధితుడు కేంద్ర న్యాయ శాఖ మంత్రికి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జిల్లా పంచాయతీ అధికారి స్పందించి, విచారణ చేసేందుకు తనను నియమించారని రెడ్డయ్య తెలిపారు. సదరు సమాచారాన్ని బాధితుడికి, భార్యకు, ప్రస్తుత పంచాయతీ కార్యదర్శికి, బదిలీ అయిన కార్యదర్శికి తెలియజేశామని పేర్కొన్నారు.

స్వామివార్లకు వెండి కిరీటాల సమర్పణ

భీమవరం అర్బన్: మండలంలోని పెదగరువు గ్రామంలో ఉన్న శ్రీ కోదండ రామాలయంలో శ్రీరామనవమి వేడుకలు గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ఎంపీపీ పేరిచర్ల విజయనరసింహారాజు, సత్యనారాయణమ్మ, చేకూరి సూర్యనారాయణరాజులు సుమారు రెండు కేజీల విలువైన వెండి కిరీటాలను స్వామివార్లకు సమర్పించారు. ఈ కిరీటాలను అలంకరించిన అనంతరం తోటకూర సుబ్బరాజు, సువర్చల దంపతుల చేతుల మీదుగా కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. గొల్లవానితిప్ప గ్రామంలో కోదండరామ స్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గుద్దటి దత్తాత్రేయ, లక్ష్మి కరుణ దంపతులు కలశపూజ, గౌరి, విఘ్నేశ్వర ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.